# కాంతమ్మ రెండో కూతురు

కాంతమ్మ పగడచెట్టు నీడన పేముకుర్చీలో కూచునుంది. సూర్యాస్తమయే వేళ. పడమటివైపు కుంకుమ ఎండ వేసినట్టుంది. తెల్లని గ్లాస్కో సైనూ కళ్ళకి సులోచనాలూ, వడిలోని 'భక్త విజయం' తెరవనేలేదు! పుస్తకం మీద ఆమె మనసు లగ్నం అవడంలేదు, మధ్యాహ్నం రేణుక చెప్పిన వార్తే ఇంకా చెవిలో మోగుతోంది. ఏ అవస్థ వచ్చిపడిందీ? ఈ కాలపువాళ్లు విధి అంటే నమ్మరు గాని తను రేణుకకోసం ఏడుస్తుందా, పార్వతికి ప్రమోషనయిందని సంతోషిస్తుందా?

ఎన్నాళ్ళనుంచో ఆశించిన ప్రమోషన్ అయింది పెద్దమ్మాయికి. టీచర్లిచ్చే పార్టీకి పార్వతి కొండంత సంతోషంతో వెళ్ళింది. అలా పార్వతి జట్కా ఎక్కింది-ఇలా రేణు పిడుగులాంటి వార్త తన చెవిని వేసింది. తనకింక సుఖం లేదా? యీ చివర్రోజుల్లో అంతా సవ్యంగా హాయిగా గడుస్తుందనుకున్న రోజుల్లో, ఒక కన్ను పొడుచుకోవలసిందేనా?

పారూ పెద్దదై నలుగుర్ని పోషించే హోదాలో వుండగా, దానికెందుకీ కష్టాలు? మొదటినుంచీ దాని జీవితం కన్నీళ్ళతోనే తుడుస్తూ వచ్చింది. చీమకూడా హానిచెయ్యని

పార్వతి కెందుకీ కష్టాలు? తను కోరుకున్న హోదాకి వచ్చాననే వెర్రి ఆనందంలో వుండేగాని ఇంట్లో అగ్ని పుట్టిందని దానికి తెలీటుగదా?

కాంతమ్మకి యిరవై ఏడో ఏట భర్త మరణించాడు. అప్పటికి పార్వతికి పదోఏడు. రేణుకకి రెండేళ్ళూ వెళ్ళాయి. టీచరు వుద్యోగంలో రమణయ్య ఏం నిలవజేస్తాడు? వెనక ఆస్తిపాస్తుల్లేవు. ప్రావిడెంటు ఫండూ, యిన్సూరెన్సు డబ్బూ అంతా కలిపితే వెయ్యి రూపాయలన్నా కాలేదు.

ఆనాటినుంచీ కాంతమ్మ నానాగడ్డీ గరిచి ఆడపిల్లలిద్దర్నీ పెంచి పెద్దవాళ్ళని చేసింది. తను పక్కవాళ్ళింట్లో వంటపనుల్లో సాయంజేసి, పగలల్లా విస్తళ్ళుకుట్టి నాలుగు రాళ్ళు సంపాయించి కుటుంబం నిర్వహించేది. పార్వతి బడికి పోయి చదువుకుంటోంది. హెడ్మాస్టరు పూనుకోవడంవల్ల బీదపిల్ల అయిన పార్వతికి స్కాలర్‌షిప్ వచ్చింది.

విస్తళ్ళు కుడుతున్నప్పుడు కాంతమ్మ మనస్సు పార్వతి పెండ్లి, ఆమె ఇల్లూ, అలాంటి మంచిరోజుల గురించి ఆలోచించడంవైపు పరుగెత్తేది. చీపురు బద్దతో లోలుగాకులో వేసేకుట్లు ఆమె వూహా ప్రపంచంలోని పార్వతి సంసారంతో లయ కల్పేవి. కలల మధ్యలో ఆమెకి లోకపు నిజాలు తమ దారిద్ర్యం, నరకట్నాలూ జ్ఞాపకంవచ్చి కుప్పగా కూలిపోయేది.

పార్వతికి పదహారేళ్ళు వచ్చాయి. స్కూలుఫైనలు చదువుతోందిగాని పెళ్ళి సంబంధం కుదరలేదు. పెళ్ళీలేక,

చదువూ లేక...అంటూ కాంతమ్మ చదువుమాత్రం మాన్పించ లేదు. స్కూలుఫైనల్ పరీక్షలో పార్వతి మంచి మార్కులు తెచ్చుకుంది. కాని కాలేజీలో జేరేందుకు తను దగ్గిర డబ్బేదీ? అంచేత సెకండిరీగ్రేడ్ ట్రయినింగ్‌లో ప్రవేశించింది పార్వతి. రేణుక అప్పటికప్పుడే ఫస్టుఫారంలోకి వచ్చింది.

ట్రయినింగ్ పూర్తయిన నెల్లాళ్ళ లోపలే పార్వతికి వుద్యోగం దొరికింది. కాంతమ్మ కష్టాలు గట్టెక్కాయి. పార్వతికి ఉద్యోగం దొరికినా చదువుమీద తృష్ణ తగ్గలేదు. స్కూల్లో పనిచేస్తూ ప్రతినెలా వచ్చే జీతంకాక, ఇద్దరి ముగ్గురికి ట్యూషన్లు చెప్పి ఇరవై ముప్ఫైకి పైగా సంపాయించి, సంసారం గుట్టుగా సాదుతూ, పార్వతి ఇంటర్ ప్రయివేట్‌గా చదివేది.

రేణుక థర్డుఫారంలోకి వచ్చింది. రేణుక బాల్యం మామూలుగానే గడిచిపోతోంది. తల్లి కూతుళ్లూ కలిసి రేణుకని ముద్దుగా చూసుకునేవారు. తన చెల్లెలు తనకిమల్లే కష్టాలు పడకూడదని రేణుకని కంటికి రెప్పలా కాస్తూండేది పార్వతి.

మధ్య మధ్య కాంతమ్మ పెండ్లిమాట ఎత్తుతూంటే, పార్వతి బుస్సున లేచేది. తను సంసారం ఓ దరికి చేరితేగాని పెళ్ళిమాట ఎత్తవద్దనేది. రేణుకకి పెద్ద చదువు చెప్పించాలని పార్వతి ఆశ. ఒకివంక ఉద్యోగం చేస్తూ మరోవంక పరీక్షలకు కడుతూ బి. ఎ. పాసయింది. రేణుక గాబరా వల్లనేమీ, అశ్రద్ధవల్లనేమీ స్కూలు ఫైనలు ఫట్టికొట్టింది.

రెండో ఏడు పార్వతి శ్రద్ధగా కూచుని చెల్లెలిచేత చదివించింది. రేణుక ఇంటర్‌లోకి వచ్చింది. బి. ఎ. అయిన తర్వాత పార్వతి మూడు నెలలు ట్రయినింగ్ చదివి బి. ఇడి. పట్టా పుచ్చుకుంది. ఈలోగా ఆమెకీ వూరు బదిలీ అయింది. ఇక్కడ గరల్స్ హైస్కూల్లో ఫస్టు అసిస్టెంటుగా వేశారు.

కాంతమ్మకి ఇద్దరూ కూతుళ్ళే. కాని పార్వతి చదువు తప్ప వేరే ప్రపంచం లేదు. రేణుకకి చదువు జీవితంలో ఒక భాగం. రేణుక చదువుమీదకంటె చీరెలమీద, సినీమాల మీద ఎక్కువ మోజు చూపేది.

కొత్తవూరు వచ్చిన ఒక ఏడాదికి కాంతమ్మ అంతరాంతరంలోవున్న కోరిక ఫలించింది. పార్వతి రామారావుని పెళ్ళి చేసుకుంది! రామారావు చిన్నవాడు. బి. ఎల్. డిగ్రీ తీసుకు రెండేళ్ళయిందో లేదో! ఇల్లూ, వాకిలీ పొలం పుట్రా వున్నవాడు. చుట్టాలూ పక్కాలూ కూడా అంతగా లేరతనికి.

పార్వతి పెళ్ళి తర్వాత కాంతమ్మకి ఇంక నిశ్చింతే. హాయిగా నిద్దరపడుతోంది రేణుకదేముంది? దాన్ని వాళ్ళిద్దరూ చూసుకుంటారు. అల్లుడిరాకతో యిల్లు మారారే గాని పెద్దమార్పు లేమీ రాలేదు వాళ్ళ కుటుంబంలో.

"దసరా పండగలకి మైసూరు వెళ్ళి రండి" అంది కాంతమ్మ కూతుర్ని, అల్లుణ్ణే ఉద్దేశించి. తన మనోవాంఛితంకూడా అదే అన్నాడు అల్లుడు. కాని పార్వతి నవ్వి, "అసిస్టెంట్ నయా"నని అందరూ ఏడుస్తున్నారు. ఇప్పుడే

కలవు పెట్టినా, ఇంకోవూరు బదలాయిస్తారు. ఇప్పుడు మీ అల్లుడైనా ప్రాక్టీస్ మానెయ్యాల్సివస్తుంది. లేకపోతే నేను ఉద్యోగమైనా మానెయ్యాల్సి వస్తుంది!" అని తల్లి మాటలు లక్ష్యం చెయ్యలేదు.

కాంతమ్మకి కూతురి మనస్తత్వం అర్థం అవలేదు. సుఖపడుతుందిగదా అని నాలుగు రోజులపాటు వెళ్ళమంటే వుద్యోగం అని గోలపెడుతుందేమిటే? వయసులో వున్నప్పుడుగాక యీ సరదాలు ఇంకెప్పుడు?

వివాహానంతరం పార్వతిలో మార్పువస్తుందనీ, ఇల్లూ, వాకిలి పట్టించుకుంటుందనీ కాంతమ్మ అనుకుంది. కాని పార్వతి ధోరణి వీసమెత్తుగూడా మారలేదు. ఆమెకి ఎం. ఏ. చదవాలనీ హెడ్‌మిస్ట్రెస్ అవాలని తృష్ణ.

రామారావు మూడు అయ్యేవేళకి కోర్టునుంచి యింటికొస్తాడు. అతను ఇంటికొచ్చే వేళకి పార్వతి ఇంట్లో వుండటం ఎలానూ పడదు. బి. ఏ. పోవడంవల్ల సెప్టెంబరుకి కట్టే రేణుక బావగారి సంగతి చూసేది, కాంతమ్మకి రేణుక బావగారితో అంత వేళాకోళాలాడటం నచ్చలేదు. కాని ఏమంటుంది? పార్వతి కష్టపడినన్నాళ్ళు పడింది. ఇప్పుడయినా హాయిగా స్కూలు వదలగానే ఇంటికొచ్చి, ఏ షికారుకో, ఏ సినిమాకో అతనితో కలిసివెళ్ళక, కాంపోజిషన్ పుస్తకాలో ఎం. ఎ. పుస్తకాలో పుచ్చుకుని పార్వతి కూచోడం కాంతమ్మకి బావుండలేదు.

మొదట్లో అల్లుడికి కూతురి చదువుమీద, తెలివి

మీాద గౌరవంవున్నా భర్త భార్యలో స్త్రీని చూడబోతాడు గాని డిగ్రీలు కాదుకదా? పార్వతి భర్తపక్కన కూచుని ఖబుర్లు చెప్పాలనీ, సినిమాకి వెళ్ళాలనీ, ధ్యాసే వుండదు. కొత్తలో ఏ రెండు మూాడుసార్లు వెళ్ళిందో అతనితో కలిసి. ఆపైన తన నోటితోనే "రేణుకకి సినిమాలంటే వెర్రి. దాన్ని తీసుకెళ్ళరూ!" అనేది.

"అదెందుకే – నువ్వు వెళ్ళు" అని కాంతమ్మ అందామని అనేకసార్లు అనుకుంది. లౌకికజ్ఞానం లేదుకదా పార్వతికి! ప్రమోషనయిందని చాటంత ముఖంతో ముందు తన దగ్గిరకొచ్చి చెప్పింది పార్వతి! వరండాలోని అల్లుడి ముఖం చూసి కాంతమ్మ గుండె గతుక్కుమంది. ముందు అతనితో చెప్పాలిగాని తనతోనా! ఆ మాత్రం యింగితం లేదే పార్వతికి.

పార్వతి జట్కాలో అడుగెట్టింది. అల్లుడు బయట కెళ్ళాడు. రేణుక తల్లి కాళ్ళదగ్గిర కూచుని తల వంచుకుంది. "అమ్మా నేనింక ఇక్కడనుంచి వెళ్ళిపోతాను. అక్కకి ద్రోహం చేశాను. క్షమించమని చెప్పు, నాకు నాలుగో నెలని తెలిస్తే నన్ను వొదిలేందుకు ఎవరూ వొప్పుకోరు. అక్క వొప్పుకోదు; బావ వొప్పుకోడు. కాని అక్క సంసారం ఛేదించి, యీా యింటిని కల్మషపూరితం చెయ్యడం నాకిష్టంలేదు... నా పాపం నేనే అనుభవించాలి. యీా రహస్యం ఇలాగే వుండిపోవాలి," రేణుక కంఠం వణికింది. నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. "నిన్న అక్క దాచమని యిచ్చిన

మూడువందల రూపాయిల కాయితాలు యిటిచ్చేయ్ - నేను వెళ్ళిపోతాను" అంది రుద్ధకంఠంతో.

కాంతమ్మ ఇచ్చింది; రేణు వెళ్ళిపోయింది.

ఎవరిది తప్పనాలో కాంతమ్మకి బోధపడ లేదు. అల్లుణ్ణి మటుకు ఏమంటుంది? అతను మగవాడు — అంతే! తన కూతురు పార్వతి మామూలుగా గాడి తప్పి నడిచింది. రేణూ ఆడది, ఏమవుతుందో? ఏ పంచని ఏ కష్టాలు పడుతుందో!

—o—